విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

మోసగాళ్ల మాయలో పడవద్దు
- జిల్లా ఎస్పి డి. మేరీ ప్రశాంతి

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: మహిళలు మోసగాళ్ల మాయలో పడవద్దని జిల్లా ఎస్పి డి.మేరీ ప్రశాంతి సూచించారు.ఏలూరు జిల్లా పోలీసు ప్రధాన కార్యాల యంలో సోమవారం జిల్లా ఎస్పి డి.మేరీ ప్రశాంతి, అదనపు ఎస్పి అడ్మిన్ స్వరూప రాణి స్పందన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలు మూలల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు.స్పందన కార్యక్రమానికి 57 ఫిర్యాదులు వచ్చాయి. సత్వరమే చట్ట ప్రకారం ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు అధికారులతో ఫోన్‌లో మాటలాడి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మోసగించే మోసగాళ్ల పట్ల జాగ్రత్తలు వహించాలని హెచ్చరించారు.సిఫార్సు లతో ఉద్యోగాలు రావని, ఉద్యోగాల కొరకు నిర్వహించే ప్రామాణిక పరీక్షలలో ఉత్తీర్ణత సాధిస్తేనే ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు.నిరుద్యోగులు, ప్రజలు ఎవరు మోసగాళ్ల చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు.

జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీలు 235 స్వీకరణ
జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి

విశాలాంధ్ర-ఏలూరు: సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జరిగిన జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారిణి డి. పుష్పమణి డిఆర్డిఏ పిడి డాక్టర్ ఆర్. విజయరాజు, హౌసింగ్ పిడి కె. రవికుమార్, ఎపిక్ జోనల్ మేనేజర్ కె .బాబ్జి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజిలెన్స్ సివిల్ సప్లై అధికారిని దేవకి దేవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ తో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ డి. పుష్పమణి మాట్లా డుతూ సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం-స్పందన 235 అర్జీలు స్వీకరించడం జరిగిందని ప్రతి అర్జీ సంబంధిత అధికారులు క్షుణంగా పరిశీలించి సకాలంలో అర్జీదారుడికి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై స్పందించండి

విశాలాంధ్ర-నర్సాపురం: స్పందన ఫిర్యాదులపై స్పందించి పరిష్కారం చూపాలని జిల్లా ఎస్ పి అజిత వేజండ్ల అధికారులను ఆదేశించారు. నరసాపురం రూరల్ సిఐ కార్యాల యం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో ఎస్పి పాల్గొని అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమానికి వివిధ ప్రాంతాలకు చెందిన అర్జీలు హాజరై ఎస్ పి కి అర్జీలు అందించారు. సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో మొత్తం 21 అర్జీలను స్వీకరించారు. వాటిలో భార్యాభర్తల తగాదాలు, కుటుంబ కలహాలు, సైబర్ క్రైమ్, కొడుకు కోడలు వదిలేశారని వృద్ధురాలు, ప్రభుత్వ మోటార్ ట్రై సైకిల్ ఇప్పిస్తానని రూ. 40 వేలు తీసుకుని మోసం చేశారని దివ్యాంగుడు, భర్త గల్ఫ్ దేశం వెళ్లి కుటుంబ పోషణకు డబ్బులు పంపడం లేదని భార్య తదితర కారణాలతో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి వి. భీమారావు, డిఎస్పి లు రవి మనోహరాచారి, వి.నారాయణ స్వామి రెడ్డి, సిఐలు గోవిందరావు, కే అప్పలస్వామి, వెంకటేశ్వర రావు, ఎస్ఐ లు ప్రసాద్, గురవయ్య తదితరులు ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి వైఎస్ఆర్ ఆసరా

విశాలాంధ్ర - ముదినేపల్లి : మహిళల ఆర్థిక అభివృద్ధికి వైయస్సార్ ఆసరా దోహదపడుతుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని సింగరాయపాలెం గ్రామంలో నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కులను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మండలంలోని డ్వాక్రా మహిళలకు నాలుగో విడత రుణ మాఫీగా 1258 గ్రూపులకు 12630 మంది సభ్యులకు గాను 47 కోట్ల 11 లక్షల 23 వేల 534 రూపాయలు మంజూరైన చెక్కులను వారికి అందజేశారు. నవరత్నాల్లో సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నాలుగో విడత అందజేయడం డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఎంతో అండగా ప్రభుత్వం నిలబడిందన్నారు. మహిళల స్వయం సంఘాలకు ఆసరా, చేదోడు, చేయూత పథకాలు ఇచ్చి వారికి వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మహిళలు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, , డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కట్టుబడ్డ ప్రభుత్వం

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రభుత్వం మహిళా సాధికారతకు కట్టుబడి వుందని పోలవరం శాసనసభ్యుడు తెల్లం బాలరాజు తెలిపారు. బొర్రంపాలెం గ్రామంలో వైసిపి ఏలూరు పార్ల మెంటు ఇన్‌చార్జి కారుమూరి సునీల్ యాదవ్, పోలవరం నియోజకవర్గం ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మీతో కలిసి 4వ విడత ఆసరా చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది అన్నారు. ముఖ్య మంత్రి జగన్మోహనరెడ్డి ప్రతి పథకం మహిళల పేర పెట్టి మహిళా పక్షపాతిగా అని నిరూపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, ఎంపీపీ డి. లక్ష్మి వెంకటేశ్వరరావు, పోలవరం నియోజకవర్గ పరిశీలకులు వెజ్జు వెంకటేశ్వరరావు,మండలం కన్వీనర్ శ్రీను రాజు, వాసిరెడ్డి మధు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

వైసీపీని గద్దె దింపకపోతే అన్ని విధాల నష్టం

విశాలాంధ్ర -గణపవరం: రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో వైయస్సార్ పార్టీని గద్దె దింపకపోతే రాష్ట్రం అన్ని విధాల నష్ట పోతుందని, రాబోయే రోజుల్లో యువత భవిష్యత్తు అంధకారం అవుతుందని తెలుగుదేశం పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. సోమ వారం గణపవరం మండలం కోమర్రు గ్రామంలో రచ్చబండ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గన్ని మాట్లా డుతూ తెలుగుదేశం, జనసేన పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు 3వేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని, ప్రతి చదువుకునే పిల్లలకు తల్లి వందనం పేరిట సంవత్సరానికి 15వేల రూపాయలు ఇస్తామని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు 1500 రూపాయలు ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యళ్ల సుబ్బారావు, వున్నమట్ల సునీత, ఇందుకూరి రామకృష్ణంరాజు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి
ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-ఏలూరు: 2023 డిసెంబర్, 2024 జనవరి మాసాలలో మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, డిఎంఏ అధికారులు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ)ఆధ్వర్యంలో ఏలూరు కోటదిబ్బ ఎస్ ఆర్ వన్ వద్ద ఉద్యోగ సిబ్బంది నల్ల రిబ్బనులు ధరించి నిరసన తెలిపారు. సోమవారం కోటదిబ్బ ఏఐటీయూసీ కార్యకర్తలు మస్టర్ సమయంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ. అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో నగరపాలక సంస్థలలో పురపాలక సంఘాలలో నగర పంచాయతీలలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ సిబ్బందికి, స్కిల్డ్, సెమి స్కిల్ అన్ స్కిల్డ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగ సిబ్బందికి బకాయిపడిన మూడు సంవత్సరాల సరెండర్ లీవ్ ని చెల్లించాలని, ఏలూరు కార్పొరేషన్ లో విలీనమైన 7 గ్రామ పంచాయతీల కాంట్రాక్ట్ కార్మికులకు 2022 జూన్ మాసం వేతన బకాయిని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్ఎంవి సుబ్బారావు, సిహెచ్ హరినాథ్ బాబు, బి దుర్గాప్రసాద్, డి వెంకట్, ఎం సయ్యద్ బాజీ ,సిహెచ్ శ్రీనివాస్, డి రాము, ప్రమోద్, ఆర్ శ్రీనివాసరావు, ఎస్ గౌరీ శంకర్, ఎస్ కే ఆలీ, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను జీవో రూపంలో ఇవ్వాలని కోరుతూ ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం మున్సిపల్ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ మస్టర్ పాయింట్ వద్ద కార్మికులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమం లో జంగారెడ్డి గూడెం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి బొక్క శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఇంగుర్తి నాగరాజు,చాపల రమేష్, కలపాల యేసు, సోమయాజుల వీరప్రసాద్, ముప్పిడి శ్రీను, పొడుదోలు రమణ, కొత్తూరి ఎమిలేశ్వరరావు, యడ్లపల్లి ప్రసాద్ ఇంజనీరింగ్ విభాగం ఉపాధ్యక్షులు దోసూరి నాగరాజు, కార్యదర్శి ఎన్. సుబ్బారావు, అయినాల ముత్యాలరావు,ప్రసాద్,అప్పలస్వామి, వీర్రాజు, కన్నూరు రాంబాబు, ముప్పిడి నాగేశ్వరావు తదితర కార్మికులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంకండి

విశాలాంధ్ర-నర్సాపురం: భవిష్యత్తులో జరగనున్న ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పి అజిత వేజేండ్ల అన్నారు. సోమవారం నరసాపురం వైయస్ కళాశాలలో పశ్చిమ గోదావరి జిల్లా జీ.ఈ.ఎస్.యల్, ఏపి.యల్.ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్ ఆన్ డిపార్ట్మెంట్, వల్నార్బులిటీ మ్యాపింగ్ కార్యక్రమంలో ఎస్పీ అజిత మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిపేందుకు కీలకమైన భద్రతా, ఎన్నికల నిబంధనల నియమావళి తదితర అంశాలను వివరించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన మార్గదర్శకమైన అనుసరిస్తూ పోలీసు అధికారులు, సిబ్బంది పని చేయాలన్నారు.

జిల్లా ఎస్పి అజితకు జర్నలిస్టుల అభినందనలు

విశాలాంధ్ర-నరసాపురం: పశ్చిమగోదావరి జిల్లా ఎస్పి గా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా నరసాపురం స్పందనకు విచ్చేసిన ఎస్‌పి అజిత వెజేండ్లను నరసాపురం ప్రెస్ క్లబ్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలతో అభినందనలు తెలిపారు. పేదలకు సేవలు అందించాలనే లక్ష్యంతో అమెరికాలో లక్షలాది జీతం వచ్చే ఉద్యోగాన్ని వదులుకుని సివిల్స్ ద్వారా ఎస్ పి గా పేదలకు సేవలందిస్తున్న అజిత యువతకు ఆదర్శమన్నారు. జిల్లా ఎస్ పి గా అజిత మంచి పేరు తెచ్చుకోవాలని వారు ఆకాంక్షించారు. ఎస్పీకి అభినందనలు తెలిపిన వారిలో ప్రెస్ క్లబ్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు మురళీధర్, వి ఆనంద్ కుమార్, కృష్ణ భగవాన్, అధికారి కొండబాబు, కె.బాలకృష్ణ,పి.తాతాజీ,తదితరులు ఉన్నారు.

కళ్లు దానం

విశాలాంధ్ర-లింగపాలెం: గుండెపోటుతో మృతి చెందిన సింగగూడెం గ్రామానికి చెందిన పి. శ్రీనివాసరావు కళ్ళను కుటుంబ సభ్యులు విజయవాడ ఐ అగర్వాల్ హాస్పిటల్ కు దానంగా అందించారు. వ్యవసాయం చేసుకుని జీవించే ఈయన హఠాత్తుగా గుండెపోటు రావడంతో గ్రామంలో మృతి చెందాడు. భార్య మాధురి, కుటుంబ సభ్యుల కోరిక మేరకు ఈయన కళ్ళను మరొకరికి దానం చేయాలని సంకల్పం కలగడంతో వీటిని ఆసుపత్రికి అందించారు. ఈ కుటుంబ సభ్యుల సేవా గుణాన్ని ప్రతి ఒక్కరూ అభినందించారు. ఈయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

మున్సిపల్ కార్మికుల హామీలను తక్షణం అమలు చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు సోమవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భజంత్రీ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపల్ నగర పంచాయతీలు, కార్పొరేషన్, మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ మున్సిపల్ ఉద్యోగ కార్మికులకు తమ సమస్యలు పరిష్కారం నిమిత్తం జనవరిలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలోకి మున్సిపల్ కార్మికులు వెళ్లారని తెలిపారు. అనంతరం ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తానని ఆ సమస్యలు జీవో రూపంలో విడుదల చేస్తామని హామీ ఇచ్చిందని, దానికి అనుగుణంగా తాత్కాలికంగా సమ్మెను వాయిదా వేశామన్నారు. చర్చలు జరిగి నెల రోజులు పూర్తయినా జీవో విడుదల చేయడంలో తాత్సారం చేస్తున్న కారణంగా నేడు, రేపు ఆందోళన, నిరసన, ధర్నాలు చేయడానికి యూనియన్ రూపకల్పన నేపథ్యంలో నేడు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యామని మంగళవారం ఉదయం గం.11 లకు ఏలూరు నగర కార్పొరేషన్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో ప్రభుత్వ వైఖరికి నిరసనగా ధర్నా జరుగుతుందన్నారు.తక్షణం ప్రభుత్వం హామీలు అమలు చేయకపోతే ఈనెల సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో ఏలూరు నగర యూనియన్ అధ్యక్షులు యలగాడ దుర్గారావు, జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డికార్ల నాగబాబు, ఏలూరు యూనియన్ నగర కార్యనిర్వాక అధ్యక్షులు యలగాడ శివకుమార్, బంగారు దుర్గాప్రసాద్, కిలారి వెంకన్న, బాబు, ఇంటి అశోక్,పి వంశీ, సిరంశెట్టి సురేష్, డి రవీంద్ర, సులోమన్ రాజు ,అంతరాజు ఉమా, బంగారు నాగమణి, కశింకోట మల్లమ్మ, తంగెళ్ళ ఉమా, సిరంశెట్టి భవాని, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలపై జీవో విడుదల చేయాలి

విశాలాంధ్ర-చింతలపూడి: రాష్ట్రవ్యాప్తంగా గత నెలలో జరిగిన మున్సిపల్ కార్మిక సమ్మెలో ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలను తక్షణం జీవో రూపంలో విడుదల చేయాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) చింతలపూడి శాఖ అధ్యక్షులు వెలగాడి అనురాధ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గత నెలలో జరిగిన మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వంతో జరిపిన చర్చలను జీవో రూపంలో విడుదల చేయడంలో ఉన్న జాప్యాన్ని నిరసిస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ సమ్మె సందర్భంగా ప్రభుత్వం చర్చలకు పిలిచి జీతం రూ.21 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి నేటి వరకు దీనిపై జీవో విడుదలపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదని విమర్శిం చారు. పండగ అలవెన్స్ రూ.1000 ఇస్తామని జీవో రిలీజ్ చేసినా అది ఆర్థిక శాఖకు పంపకపోవడం వల్ల నేటికీ కార్మికులకు ఇవ్వలేదన్నారు. తక్షణం చర్చల సందర్భంగా అంగీకరించిన సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో దశల వారి ఆందోళనలో చేపడతామని హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్ కార్యాల యాల వద్ద ధర్నా కార్యక్రమాలు ఉన్నాయని, వాటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని సచివాలయాల్లో ఏఐటియుసి కార్మికులు నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరైనట్లు తెలిపారు. సచివాలయం1లో శ్రీరామ్ వెంకటయ్య, శ్రీరామ్ పార్వతి, బొత్స నారాయణ, సచివాలయం2 మొగులపాటి పుల్లయ్య, సాయమ్మ, శ్రీరామ్ కృష్ణ, సచివాలయం3 బి.సరోజినీ, బి. రాజేష్, బి. మౌనిక, సచివాలయం4 పొదిలి చిన్నయ్య, పొదిలి మార్తమ్మ, సచివాలయం5 వెలగాడి కళ్యాణ్, గంధం రాజేష్, తదితరులు నాయకత్వం వహించారు.

పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం: పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి నట్లుగా ఎస్ఐ డి.దుర్గా మహేశ్వర రావు తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం టి నరసాపురం గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో తన సిబ్బందితో సోమవారం దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి మూడు వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నాయకుల్లో కానరాని సమర్థత

- ఆనాటి నాయకుల వారసులు ప్రజలను ఆకట్టుకోలేకపోతున్న వైనం
- గోడమీది పిల్లి వాటం రాజకీయాలు
- గతి తప్పుతున్న రాజకీయ విలువలు

విశాలాంధ్ర - లింగపాలెం : చింతలపూడి నియోజకవర్గం.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజకీయ చైతన్యం కలిగిన నియోజకవర్గంగా చరిత్రలో నిలిచింది. ఎందరో రాజకీయ వ్యూహకర్తలకు జన్మనిచ్చిన నియోజకవర్గంగా పేరు ఉంది. 1952 నుంచి పరిశీలిస్తే ఎన్నో రాజకీయ సంచలనాలు నియోజకవర్గంలో చరిత్ర సృష్టించాయి. 1983 నుంచి 2024 వరకు ఒకే ఎమ్మెల్యేగా గెలుపొందుతూ మంత్రిగా పనిచేసిన కోటగిరి విద్యాధరరావు రాష్ట్ర చరిత్రలో తనకంటూ ఒక స్థానాన్ని, నియోజకవర్గ స్థాయిని నిలబెట్టిన నాయకునిగా పేరు నిలిపారు. తెలుగుదేశం ఆవిర్భావంలో జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం ప్రభంజనం ఉంటే చింతలపూడి నియోజకవర్గంలో కోటగిరి విద్యాధరరావు స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది రాజకీయ సంచలనం సృష్టించిన చరిత్ర నియోజవర్గానికి ఉంది. 1972 దశకంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం ఉంటే చింతలపూడి నియోజకవర్గంలో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థిపై స్వతంత్ర అభ్యర్థిగా కూనయ్య విజయం సాధించారు. 2009కి ముందు రాజకీయాలు నియోజకవర్గంలో ప్రత్యేకంగా ఉండేవి. ఎత్తులు, పైఎత్తులతో రాజకీయ వర్గాల తమ ప్రతిష్టను చాటుకునేవారు. ఆనాటి రాజకీయ నాయకులు తీరు గొప్పగా ఉండేది. ఇప్పుడు నాయకుల తీరు ఆకట్టుకోలేక పోతున్నది. ప్రతీ పార్టీలోను ఇదే తీరు. ఇప్పటి రాజకీయ నాయకుల తీరును, వీరు చేసే రాజకీయ వ్యవహారాలను విశ్లేషిస్తే చింతలపూడి నియోజకవర్గానికి ఇదేం ఖర్మంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు. గతంలో నాయకులుగా ఉన్న వారు వ్యక్తిగత ఇమేజ్‌ని కాపాడుకోవటానికి ప్రయత్నించే వారు. ఇప్పుడు ఒకసారి ఎమ్మెల్యే అయిన వారు తిరిగి పార్టీల, ప్రజల ఆదరణ పొందలేకపోతున్నారు. దీనికి జరిగిన, జరుగుతున్న పరిణామాలనే ఉదాహరణగా తీసుకోవచ్చు. పదవులు చేసిన నాయకుల తప్పులు, ఒప్పులు సంగతి అలా ఉంచితే రాణించలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం నియోజకవర్గంలో రాజకీయ దురంధరులు లేరు. ఉన్న కొద్ది మంది వయో భారంతో ఇళ్ళకు పరిమితమయ్యారు. పార్టీలకు నాయకత్వం వహించిన నాయకుల వారసుల్లో అత్యధికులు ప్రజల మన్ననలను పొందలేక తులమునకలవుతున్నారు. ఇక పార్టీలకు నాయకత్వం వహిస్తున్న అధికార పార్టీలో పరిశీలిస్తే అనుభవ రాహిత్యం, నాయకత్వం వహిస్తున్న నాయకులలో ఉన్న వ్యక్తిగత డ్యామేజి ప్రభావం ప్రజల్లో ఉంది. ఇక ప్రధాన ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలో కొందరు ప్రధాన నాయకుల తీరు ఆ పార్టీ నాయకులలో విమర్శలకు తావిస్తుంది.

ఒకాయన కర్ర విరగ కుండా, పాము చావకుండా వ్యవహరిస్తున్నాడని, ఇంకొక నాయకుడు గోడ మీద పిల్లిలా కాచుకుని చూస్తున్నాడని, ఇంకొద్ది మంది ఎవరు డబ్బు ఇస్తే వారివైపే అన్నట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ పరిణామాలు అటు అధికార వైసీపీలో, ఇటు ప్రతిపక్ష తెలుగుదేశంలో ఎటువంటి పరిణామాలకు దారితీస్తాయోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

జగనన్నకు చెబుదాం అర్జీలు నాణ్యతతో పరిష్కరించాలి

విశాలాంధ్ర-భీమవరం: జగనన్నకు చెబుదాం - స్పందన అర్జీలను అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేటులోని స్పందన సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక "జగనన్నకు చెబుదాం-స్పందన" కార్యక్రమంలో జిల్లా నలుమూలల ప్రజల నుంచి వచ్చిన వినతులను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం - స్పందన అర్జీలను అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వీకరించిన అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్మెంట్ అంద జేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్మెంటును కార్యాలయాల వద్దకు పిలిపించి ఎండార్స్మెంట్ అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా రెవిన్యూ అధికారి బి.శివనారాయణ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు, ఇన్‌చార్జి జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి కానాల సంగీత్ మాథర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు వరి పంటలపై తెగుళ్లు నివారణ చేసుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: వరి పండించే రైతులు వరి పంటలపై వచ్చే తెగుళ్ల వాటి నివారణకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు సలహాలు పాటించాలని తాడేపల్లిగూడెం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మురళీకృష్ణ అన్నారు. సోమవారం గణపవరం మండలం సరిపల్లె రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కూసంపూడి జగపతి రాజు అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏడిఏ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు మండలంలో రైతు భరోసా కేంద్రాల వద్ద ఉన్నాయని, ఫిబ్రవరి 15వతేదీ లోపు ఈ- క్రాప్ ఇకేవైసీ రైతులు అందరూ ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి వెంకట సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ రైతులు వరి చేలకు సాగునీరు వంతుల వారి విధానం ద్వారా నీటి వ్యవస్థ ప్రారంభమైందని, దానికి అనుగుణంగా పంట పొలాలను చూసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఉన్న రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఓటు వేయడం ప్రతి పౌరుడి బాధ్యత

విశాలాంధ్ర-భీమవరం: ఓటు వేయడం ప్రతి పౌరుడి బాధ్యతగా స్వీకరించాలని ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి బి. శివన్నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేటు ప్రాంగణం, స్పందన సమావేశ మందిరంలో స్వీప్ యాక్టివిటీలో భాగంగా స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలలనుండి వచ్చిన ప్రజలు చేత జిల్లా రెవిన్యూ అధికారి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఓటు విలువైనదని, ఓటు ప్రజాస్వామ్య పరిరక్షణకు మూలధారమని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఓటు నమోదు చేయించుకోవడం, ప్రక్క వారితో కూడా నమోదు చేయించడం ఓటు వేయడం ప్రతి పౌరుడి అత్యంత బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్ అప్పారావు, జిల్లా వివిధ శాఖలు అధికారులు, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనరు చెరుకువాడ శ్రీరంగ సాయి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఇవ్వాలి

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: టిడ్కో జి ప్లస్ త్రీ గృహాల నిర్మాణాలను పూర్తి చేసి వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని కోరుతూ జనసేన నాయకులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మరీదు శివరామకృష్ణ, ముత్యాల కామేష్, ముమ్మలనేని సునీల్ కుమార్, బోను అప్పారావు, బండారు రాజు, యర్రంశెట్టి రాము, దద్దనాల రవి కిషోర్, జయలక్ష్మి, ధనలక్ష్మి, చంద్ర, శ్రీను, సత్యనారాయణ, షేక్ బాజీ, తోట బలరాం తదితరులు పాల్గొన్నారు.

భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు

విశాలాంధ్ర-ఏలూరు: రోడ్డు ప్రమాదాలు అపారమైన ప్రాణ, ధన నష్టాన్ని కలిగిస్తున్నాయని, రహదారిని ఉపయోగించే మనమంతా భద్రత నియమాలు పాటించడం ద్వారా చాలా ప్రమాదాలను నివారించవచ్చునని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కెవిఎస్.ప్రసాద్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి అధ్వర్యంలో సోమవారం వట్లూరు సర్ సి.ఆర్.రెడ్డి మహిళా కళాశాలలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీబ్రా గుర్తు వున్న చోట మాత్రమే రోడ్డు దాటాలని, ఫుట్ పాత్ లేని చోట్ల రోడుకు కుడి వైపున నడవాలన్నారు. ప్రతిఒక్కరు హెల్మెట్, సీటుబెల్ట్ ఉపయోగించడం తప్పనిసరి అన్నారు. వాహనదారులు మలుపు తిరిగేటప్పుడు సిగ్నల్స్ ఇవ్వాలని, వన్ వేలో వాహనము నడపరాదని వివరించారు. ఈ కార్యక్ర మంలో మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్లు కెవిఎస్.ప్రసాద్, జి.ప్రసాదరావు, కళాశాల ప్రిన్సిపల్ పి.శైలజ, సిబ్బంది, కళాశాల బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

సంగీత ప్రపంచంలో ఘంటసాల పాత్ర అద్వితీయం

విశాలాంధ్ర-తణుకు: సంగీత ప్రపంచంలో ఘంటసాలకు విశిష్టమైన స్థానం ఉందని రాష్ట్ర వీవర్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీసీ నాయకురాలు వావిలాల సరళాదేవి అన్నారు. ఘంటసాల వెంకటేశ్వర రావు వర్ధంతి సందర్భంగా స్థానిక ఎన్ టి ఆర్ పార్క్ వద్ద వున్న ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహం వద్ద వావిలాల సరళా దేవి ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఘంటసాల విగ్రహానికి సరళా దేవి, కడియాల సూర్యనారాయణ, సితారై,వావిలాల వీర వెంకట పవన్ కుమార్, ఆర్కెస్ట్రా రాజు పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సరళా దేవి మాట్లాడుతూ ఘంటసాల ఆయన జీవిత విశేషాలు తెలియజేస్తూ ఆయన ప్రపంచ వ్యాప్తంగా సంగీతంలో అమృతం కురిపించి అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి అని కొనియాడారు. ఆర్కెస్ట్రా రాజు ఘంటసాల గేయాలను ఆలపించారు.ఈకార్యక్రమం లో షణ్ముఖ విజయ్, మిమిక్రీ రాము పాపోల్ల లక్ష్మి, వరహాలు కళా కారిణి రమణి, ఎం. నాగ మణి, కె. సుబ్బలక్ష్మి, గంగా భవానీ, వాణీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

విశాలాంధ్ర - ముదినేపల్లి : ముదినేపల్లిలో రూ.61 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు , మైక్రో ఫిల్టర్ పైప్ లైన్ నిర్మాణాలకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు , ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ నాయకులతో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ముదినేపల్లిలో పోలీస్ స్టేషన్ బజార్ రూ 30 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు శంకుస్థాపన , మైక్రో ఫిల్టర్ పైప్ లైన్ రూ 16 లక్షలు మరో అంతర్గత సీసీ రోడ్డుకు 15 లక్షలు ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిని వైసిపి అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ బిక్షాలు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, జడ్పీటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీలు జంపాన కోటయ్య, మరీదు నాగయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బడేటి చంటి పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-ఏలూరు: టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) పుట్టినరోజును పురస్కరించుకుని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ ఆధ్వర్యంలో మూడో డివిజన్ టిడిపి కార్యకర్తలు, పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను వ్యక్తిగతంగా కలిసి శుభాకాంక్షలు తెలుపారు. జీవితాంతం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, రాబోయే ఎన్నికలలో ప్రజాప్రతినిధిగా విజయం సాధించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో సయ్యద్ కరీం, షేక్ మస్తాన్, కలిదిండి సతీష్ రాజు, మర్రి ఏసు, సిరి శెట్టి నారాయణ ప్రసాద్, టిడిపి మూడవ డివిజన్ అధ్యక్షులు చనపతి రమణ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో వైసీపీ విఫలం

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో వైసీపీ ఘోరంగా విఫలం చెందిందని జనసేన పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్చార్జి చిర్రి బాలరాజు పేర్కొన్నారు. మండలంలో బయ్యనగూడెం గ్రామంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తోట వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో జనం కోసం జనసేన కార్యక్రమాన్ని గ్రామంలో చిర్రి బాలరాజు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిర్రి బాలరాజు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి అభివృద్ధి పై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రజలను గాలికి వదిలేసిన వైసిపి ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకుండా సొంత పథకాల ప్రచారానికే పరిమితం అవుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో చోడి పిండి సుబ్రహ్మణ్యం, మాదేపల్లి శ్రీను, ఏపూరి సతీష్, గొలిశెట్టి శ్రీనివాస్,సరిపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ తాడేపల్లి గోపి, వంశి, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన కుటుంబాలకు అండగా ఉంటాం

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : జన సైనికులకు వారి కుటుంబాలకు పార్టీ నిత్యం అండగా ఉంటుందని జనసేన పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్రి బాలరాజు పేర్కొన్నారు. మండలంలో రామనుజపురం గ్రామానికి చెందిన ఏటూరి వెంకాయమ్మ భర్త, కుమారుడు అకాల మరణం చెందడంతో వారి కుటుంబ సభ్యులకు చిర్రి బాలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు తోట వీర వెంకట సత్యనారాయణ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంతాపం తెలియజేశారు. 6నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సుంకర రాజేష్, ఉపసర్పంచ్ సోమిశెట్టి మధు, గ్రామ పార్టీ నాయకులు కోనే శివ,అడప కిషోర్, కోనే బాలకృష్ణ, అడప మునిష్, సుంకర చందు, బొర్రా సతీష్, యార్లగడ్డ శ్రీను, బందారు కిట్టు, తదితరులు పాల్గొన్నారు.

బాబు భవిష్యత్తు పత్రాలు పంపిణీ

విశాలాంధ్ర - కైకలూరు : కైకలూరు మండలం కైకలూరు లో తెలుగుదేశం పార్టీ - జనసేన పార్టీల పర్యవేక్షణలో మండల టిడిపి అధ్యక్షులు పెన్మెత్స త్రినాథ్ రాజు,క్లస్టర్ పోలవరపు లక్ష్మీ రాణి ఆధ్వర్యంలో నారా చంద్రబాబు నాయుడు, కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో 2024లో తెలుగుదేశం పార్టీ - జనసేన పార్టీ ప్రభుత్వం ఏర్పడడంతో ప్రతి కుటుంబానికి వర్తించే సంక్షేమ పథకాలు బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ హామీ పత్రాలను అందించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పెన్మెత్స వెంకటేశ్వరరాజు(వెంకట్ - కలిదిండి),మాజీ జడ్పీటిసి బొమ్మనబోయిన విజయలక్ష్మీ, జిల్లా టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు కోట కోటీ లింగం బాబు(కె.కె.బాబు),పట్టణ టిడిపి అధ్యక్షులు యమ్.డి.జానీ,తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ,మండల టిడిపి ఉపాధ్యక్షులు యమ్.డి.ఉస్మాన్, మార్కెట్ యార్డు కమిటీ మాజీ డైరెక్టర్ సయ్యద్ భాషిద్,లక్కింశెట్టి మోహన్,మండల తెలుగుమహిళా కార్యదర్శి శీలం కృష్ణవేణి,శివ,నున్న సాయి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని భూస్థాపితం చేద్దాం

విశాలాంధ్ర - ఉంగుటూరు : రాబోయే ఎన్నికల్లో జనసేన,టీడీపీ లను గెలిపించి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. జనసేన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉంగుటూరు మండలం బొమ్మిడి గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మహిళలు హారతులతో, యువకులు పూలతో ధర్మరాజు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ జనసేన - టీడీపీల ఉమ్మడి ప్రభుత్వాన్ని స్థాపించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. తొలుత గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ధర్మరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండలం జనసేన పార్టీ అధ్యక్షులు పంది రాంబాబు, జనసేన నాయకులు మద్దాల ఉమ,మద్దాల వాసు, యాతం పండు, కాకర్ల గంగాధరరావు, బసవ నాని, యాతం నారాయణ గ్రామ జన సైనికులు,బీజేపీ, టీడీపీ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా జగన్‌ను ఏమీ చేయలేరు

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : సింహం సింగిల్‌గానే వస్తుందని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సింహం లాంటివారని, ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా ఏమి చేయలేరని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు.భీమవరం మండలం మండల పరిధి.కొవ్వాడ గ్రామానికి చెందిన క్షత్రియ యూత్ ఉద్దరాజు రాజేష్ వర్మ ఆధ్వర్యంలో సుమారు వందమంది సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో వైసిపిలో చేరారు.ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ ప్రజలందరి సహకారంతో మరోసారి ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఒంటరిగా పోటీ చేసి ఓడించలేక అన్ని పార్టీలు కలిసి ఏకమై పోటీ చేయడానికి సిద్ధపడుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీపేరిచర్ల విజయ నరసింహారాజు, జడ్పీటిసి కాండ్రేగుల నరసింహారావు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

విశాలాంధ్ర-వీరవాసరం: సాగు కాలంలో ప్రభుత్వ పథకాలు లబ్ధి అందాలంటే పంట నమోదు తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి బిన్నిబాబు తెలిపారు. మండలంలో 2023-24 దాళ్వా పంటకు సంబంధించి ఈ - క్రాప్ బుకింగ్ జరుగుతుందని, మండలంలో పూర్తి వరి సాగు విస్తీర్ణం 11,500 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 10,800 ఎకరాలలో (69 శాతం) పంట నమోదు ప్రక్రియ పూర్తి అయ్యినట్లు ఆమె తెలిపారు. ఈ నెల 15 వ తేదీ నాటికి ఈ - క్రాప్ నూరు శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ - క్రాప్ లో పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు తప్పని సరిగా ఈ-కెవైసి చేసుకోవాలని తెలిపారు. రైతులకు కావాల్సిన యూరియా, కాంప్లెక్స్ ఎరువులు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచామని ఏవో తెలిపారు.

సార్వత్రిక ఎన్నికల్లో జనసేన ప్రభంజనం ఖాయం

విశాలాంధ్ర-టి నరసాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ ప్రభంజనం ఖాయం అని జనసేన పార్టీ పోలవరం నియోజకవర్గం ఇన్చార్జ్ చిర్రి బాలరాజు అన్నారు. తెడ్లం గ్రామంలో తెలుగు దేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం జనసేన పార్టీ మండల అధ్యక్షులు అడపా నాగరాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించ బడింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాలరాజు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జనసేన ,తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. టికెట్ ఎవరికి వచ్చిన ఒకరికొకరు సమన్వయంతో పని చేసుకోవాలని కోరారు. వైసీపీ నాయకులు ఓటమి భయంతో పుకార్లు సృష్టిస్తున్నారని ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన ఏలూరు జిల్లా కార్యదర్శి కరాటం సాయి, కార్యదర్శి గడ్డమడుగు రవి కుమార్, దిరిశాల బ్రహ్మంగారు, సంజయ్, దామోదర్ చౌదరి, తెలుగు దేశం పార్టీ నాయకులు బండి శ్రీనివాసరావు, గంధ్ర కృపాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

విశాలాంధ్ర-పాలకొల్లు: ఓటు వజ్రాయుధం అని, ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, పశ్చిమగోదావరి జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు డా. శిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో నూతనంగా ఓటు హక్కు వచ్చిన యువతకు ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగాడా. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు యువత మీదే ఆధారపడి ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు ను తన సంక్షేమం గురించి ఆలోచించే నాయకుడికి కాకుండా అహర్నిశలూ ప్రజల సంక్షేమం గురించి ఆలోచించే నాయకుడికి వినియోగించు కోవాలన్నారు. రాష్ట్రం ఐదేళ్లలో 30 ఏళ్ళు వెనక్కి వెళ్ళిందని, మహిళలకు రక్షణ మృగ్యమైందని, దళితులకి న్యాయం అందని ద్రాక్ష అయిందని, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, విచ్చలవిడిగా లభ్యమవుతున్న గంజాయి యువత శక్తిని నిర్వీర్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వల్లూరి మాధురి, బండి స్వర్ణలత, సుంకర రాజకుమారి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన కూటమిదే విజయం

విశాలాంధ్ర- నరసాపురం: రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ విజయం సాధిస్తాయని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఎ షరీఫ్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేలన్నీ తెలుగుదేశం జనసేన పార్టీలకు అనుకూలంగా చెప్పాయని, 125 సీట్లకు పైగా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం పై అన్ని వర్గాలు గుర్రుగా ఉన్నాయని, ప్రభుత్వ వ్యతిరేకత మా పార్టీ విజయానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నరసాపురం నియోజవర్గం సంబంధించి ఇరు పార్టీలు నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు,ఇంకా ఎవరు పేరు ప్రకటించలేదని అధినాయకులు తీసుకునే నిర్ణయానికి పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ఇంచార్జ్ పొత్తూరిరామరాజు, నియోజకవర్గ టిడిపి నాయకులు కొవ్వలిఫౌండేషన్ చైర్మన్ టీడీపీ సీనియర్ నాయకులు కొవ్వలి రామ్మోహన్ నాయుడు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కామయ్యపాలెం పీహెచ్సీలో విచారణ

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : గత సంవత్సరం ఆరు నెలలు కాలంలో కామయ్యపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది వివాదం చోటుచేసుకుంది సోమవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎం. నాగేశ్వరరావు విచారణ చేపట్టారు. హెల్త్ సూపర్వైజర్, ఎం ఎల్ టి ల మధ్య వివాదం చోటుచేసుకుంది. విచారణ నిమిత్తం ఇరువురిఅప్పటి డ్యూటీలో ఉన్న సిబ్బంది రాతపూర్వకంగా నివేదిక తీసుకుని రాజమండ్రి రీజినల్ డైరెక్టర్ కి నివేదిక ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ విచారణలో వైద్యులు హేమలత చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించాలి

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : ప్రజా ప్రతినిధులు విన్నవించుకున్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని మండపరిషత్ అధ్యక్షుడు గంజిమల రామారావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కే అశోక్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎంపీటీసీలు మండలంలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయాలను త్వరగా పూర్తి చేయాలని, మండలంలో అన్ని గ్రామాలలో డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉన్నదని ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి అధికారులంతా సహాయ సహకారాలు అందించాలని, ప్రజా ప్రతినిధులు చెప్పే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పలు అభివృద్ధి కార్యక్రమాలకు మండల పరిషత్ నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి,వైస్ ఎంపీపీ లు తుమ్మలపల్లి గంగరాజు, మట్ట వనజాక్షి, టి ఎన్ స్నేహన్, గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఎన్నికలలో నోడల్ అధికారులకు అప్పగించిన బాధ్యతలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిఒ, ఏపీవో, సహాయ సిబ్బంది వివరాలను ఆన్ లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయించుటకు డి డి వో లు బాధ్యత వహించాలని ఆదేశించారు. ఎన్నికల విధులు నిర్వహణలో ఏ ఒక్కరికీ మినహాయింపు వుండదన్నారు. పోలింగ్ విధులు నిర్వహించే పోలింగ్ అధికారులకి, సిబ్బందికి త్వరలో పోలింగ్ ప్రక్రియ పై వర్క్ షాపు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మ్నొదటి మీటింగు అర్ ఒ లతో రెండో మీటింగు ఈ అర్ ఒ లతో ముడో మీటింగు ఎఈ అర్ ఒ ల తో ఉంటుందని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్, ట్రాన్సిట్ స్ట్రాంగ్ రుమ్ ల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. ఎన్నికల పరిశీలకులు అడిగే సమాచారాన్ని అందజేయుటకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. నోడల్ అధికారులు వారికి అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి ఎన్నికల విజయవంతానికి కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్చి జిల్లా రెవిన్యూ అధికారి బి.శివనారాయణ రెడ్డి, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్ అప్పారావు, డిపిఆర్ఓ టి.నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వర రావు, ఆర్టీసి డిపిటివో ఏ. వీరయ్య చౌదరి, జిల్లా రవాణా శాఖ అధికారి టి. ఉమామహేశ్వరరావు, డ్వామా పిడి యం.ప్రభాకర రావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.కె మురళీ కృష్ణ, జిల్లా ఆర్ అండ్ బి శాఖ అధికారి బి.లోకేశ్వరరావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, డియస్ వో యన్. సరోజ, విద్యా శాఖ సంచాలకులు కె.సంధ్య, ఇన్చార్జి జిల్లా పంచాయతీ శాఖ అధికారి యం.నాగలత, ఇన్చార్జి డిఆర్డిఏ పిడి యంయస్ యస్ వేణుగోపాల్, తాడేపల్లిగూడెం డిఎస్పి డియస్ఆర్వియస్ యన్ మూర్తి, ఎక్సైజ్ సూపరింటెండెంటు గౌరీశ్వర రావు, ఎలక్షన్స్ తహాశీల్దారు సి హెచ్ దుర్గా ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

16న బంద్ విజయవంతం చేయండి

విశాలాంధ్ర-దేవరపల్లి: ఈనెల 16న జరుగు బందు విజయవంతం చేయాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే మస్తాన్ అన్నారు .దేవరపల్లి మండలం దుద్దుకూరులో కరపత్రాల ఆవిష్కరణ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. బిజెపి ప్రభుత్వం దేశాన్ని దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ విశాఖ ఉక్కు తో సహా అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ పరం చేయడానికి పూనుకున్నదన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలు, రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చి ప్రశ్నించే గొంతులను మూయిస్తూ తన మనుగడ సాగిస్తున్నదన్నారు. ఈ తరుణంలో 16వ తేదీన కార్యక్రమాన్ని కార్మికులు కర్షకులు విద్యార్థి మేధావులు కవులు కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మారాజు, రవి, రమణ, చిన్న, శంకర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం ప్రారంభించిన పలివెల

విశాలాంధ్ర - సీతానగరం: ఎన్నికల ప్రచారం ప్రారంభించిన సి పి ఐ ఎమ్ ఎల్ ఎమ్మెల్యే అభ్యర్థి పలివెల వీరబాబు. సోమవారం మండలంలో ఉండేశ్వరపురం గ్రామంలో పలివెల వీరబాబు సార్వత్రిక ఎన్నికల ప్రచారం ప్రారంబించారు. దీనిలో భాగంగా గ్రామంలో పాదయాత్ర చేస్తూ ఇంటి ఇంటికి తిరుగుతూ బడుగు బలహీన వర్గాలకు కొండత అండగా ఉండే మా పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు పార్టీల వైఫల్యాలను తెలియజేస్తూ రాజానగరం నియోజకవర్గంలో సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లో గ్రామ గ్రామాన పాదయాత్ర చేస్తామని పలివెల వీరబాబు అన్నారు.నేటి పాలనలో ప్రజలు జీవనం సాగించలేని పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, ఆ పరిస్థితుల గురించి తెలుసుకునేందుకు ఇంటింటికి వెళ్లి ప్రజల కష్టాలను యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడం జరుగుతుందన్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో సిపిఐ ఎంఎల్ పార్టీ తరపున రాజానగరం నియోజకవర్గం నుంచి ప్రత్యక్షంగా పోటీ చేయడం జరుగుతుందని అందుకు రాజానగరం నియోజకవర్గ ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి కోరారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు,డ్రైనేజి నిర్మాణాలు,పుంత రోడ్లు ప్రధాన రహదారులు నేటికీ అస్తవ్యస్తంగానే ఉన్నాయని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు నందమూరి చిట్టి స్వామి,సిపిఐ ఎంఎల్ నాయకులు,కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఈశ్రమ బీమాను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - రాజానగరం : కార్మికులు,కర్షకులు,డ్రైవర్లు కోసం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అందిస్తున్న ఈశ్రమ భీమా కార్డులతో ధీమాగా ఉండవచ్చనని టీడీపీ బీసీ సాధికార కమిటీ రాష్ట్ర డైరెక్టర్ వంక మల్లిఖార్జున స్వామి(మల్లిబాబు),శ్రీ లక్ష్మి గణపతి ఆటో యూనియన్ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని దివాన్ చెరువు గ్రామంలో 150 మంది కార్మికులకు ఈ శ్రమ భీమా కార్డులు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన రాజమహేంద్రవరం 3,4 సర్కిల్ లేబర్ ఇన్స్పెక్టర్లు విజయ్ ప్రకాష్, లలిత కుమారి చేతులు మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా లేబర్ ఇన్స్పెక్టర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అందించిన ఈ శ్రమ ఇన్సూరెన్స్ ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.లబ్దిదారులు వద్ద ఎటువంటి రుసుం లేకుండా జీవితకాలం రెన్యువల్ చేయనవసరం లేకుండా భీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ఉపాధ్యక్షులు చిలకసాని రాంబాబు, కోశాధికారి వంక మల్లిబాబు,సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు

విశాలాంధ్ర-నల్లజర్ల : నల్లజర్ల మండలం నల్లజర్ల ఏ కే ఆర్ జి క్యాంపస్‌లో లయన్స్ క్లబ్ దూబచర్ల, పి.ఎ.ఆర్.డి ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ నల్లజర్ల శాఖ ఆధ్వర్యంలో ఏలూరు ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఏ కే ఆర్ జి సెక్రటరీ వల్లమూడి రామారావు ప్రారంభించారు. ఈ శిబిరంలో 23 మంది రక్తదానాన్ని ఇచ్చినట్టు క్లబ్ అధ్యక్షులు కెల్లా వాసు, క్యాంపు ఆర్గనైజర్ అంబటి శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నల్లజర్ల శాఖ అధ్యక్షులు ఎండి ఇలియా షరీఫ్, లైన్స్ క్లబ్ డిస్టిక్ చైర్ పర్సన్ కూచిపూడి ఉదయభాస్కరరావు, తాతిన సత్యనారాయణ, కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, ప్రిన్సిపల్ పెమ్మాడి రఘువీర్ వర్మ, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ వట్టికూటి శివరామ్, సోమిశెట్టి వెంకట్రావు, నల్లజర్ల రిటైర్డ్ పోస్టుమాస్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంఎఫ్ జి ఇండియా క్రెడిట్ పశు వికాస్ కార్యక్రమం

విశాలాంధ్ర-కాకినాడ: భారతదేశంలోని ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ లలో ఒకటైన ఎస్ఎంఎఫ్ జి ఇండియా క్రెడిట్ కో. లిమిటెడ్ (గతంలో ఫులర్టన్ ఇండియా క్రెడిట్ కో. లిమిటెడ్), తమ 6వ పశు వికాస్ డే (పివిడి)ని నిర్వహించింది. దేశంలో ఒకే రోజు నిర్వహించిన అతి పెద్ద పశు సంరక్షణ శిబిరమిది. ఈ శిబిరాలను 14 రాష్ట్రాల్లోని 460 కి పైగా ప్రదేశాలలో ఏకకాలంలో నిర్వహించారు 1 లక్షకు పైగా పశువులకు అవసరమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించారు. భారతదేశంలో, 8 కోట్ల కంటే ఎక్కువ కుటుంబాలు నేరుగా పాడి పరిశ్రమతో సంబంధం కలిగి ఉన్నాయి మరియు శ్రామిక శక్తిలో 70 శాతం కు మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ మహిళల కృషిని స్మరించుకునేందుకు, 6వ పశు వికాస్ దినోత్సవాన్ని 'పాడిపరిశ్రమలో మహిళలు' నేపథ్యం తో వేడుక చేసుకున్నారు. ఈ కార్యక్రమం ఈ ఎస్ జీ ఫ్రేమ్‌వర్క్‌లోని 'సామాజిక' కోణాన్ని ప్రతిబింబిస్తుంది.

అంగన్వాడీ వర్కర్ పోస్టు నియామకానికి నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర - పెద్దాపురం : ప్రాజెక్టు పరిధిలో పెద్దాపురం పట్టణంలో ఒక అంగన్వాడీ వర్కర్ పోస్టుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పెద్దాపురం ఐసిడిఎస్ సీడీపీఓ జి ఉష తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ అంగన్వాడీ వర్కర్ పోస్టుకు సంబంధించి ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. పట్టణంలోని శెట్టిపేట1 అంగన్వాడీ వర్కర్ (బీసీబీ) కేటగిరి అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులన్నారు. పదవ తరగతిలో ఉత్తీర్ణులై, 35 సంవత్సరాల లోపు వయస్సు గలవారు దరఖాస్తు చేసుకోవచ్చాను. ఈ నెల 22వ తేదీలోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సీడీపీఓ ఉష తెలిపారు.

వైఎస్ఆర్సిపికి జెడ్పీ మాజీచైర్మన్ గుత్తుల రాజీనామా

విశాలాంధ్ర - కాజులూరు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తన పదవులకి రాజీనామా చేస్తున్నట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గుత్తుల బుల్లి రాజు తెలిపారు. సోమవారం మండలంలోని గొల్లపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో జిల్లా పరిషత్ చైర్మన్ గా ప్రజలకు ఎనలేని సేవలు చేశామని ఇప్పుడు ఆ పరిస్థితి లేదు అన్నారు. తన భార్య గుత్తుల సత్య దేవి జడ్పిటిసిగా ప్రజలకు ఎనలేని సేవ చేశారని అన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం తనకు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిందని, అంతేకాకుండా మండల వ్యవసాయ సలహా సంఘం కమిటీ చైర్మన్గా నియమించిందన్నారు. కేవలం పేరుకే పదవులు తప్ప ఏ విధమైన నిధులు ఇవ్వట్లేదని, దీంతో ప్రజలకు న్యాయం చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మనస్థాపం చెందిన గుత్తుల బుల్లి రాజు ఆయన భార్య సత్య దేవి ఇరువురు వైఎస్ఆర్సిపి పార్టీకి తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

16న కల్యాణోత్సవం

విశాలాంధ్ర - కాకినాడ : భక్తుల అభీష్టానికి అనుగుణంగా లోకకల్యాణార్థం ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు జిల్లా కేంద్రం కాకినాడ కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి పేరిట అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదిక కానుందని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాకినాడ సాంబమూర్తినగర్‌లో పూర్తి రాతికట్టడంతో నిర్మించిన శ్రీశ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఈ నెల 14వ తేదీన విగ్రహప్రతిష్ట చేయనున్నట్టు చెప్పారు. ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు పర్యవేక్షణలో వైష్ణవ సాంప్రదాయం ప్రకారం పురోహితులు, పండితుల సమక్షంలో బుధవారం ఉదయం 10.58 నిమిషాలకు ఈ కార్యక్రమాన్ని అత్యంత వేడుకగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రూ.4 కోట్లు వెచ్చించి ఆ మొత్తం సొమ్మును ఎలాంటి విరాళాలు వసూళ్ళు చేయకుండా తన కుటుంబంద్వారానే సమకూర్చి పూర్తి రాతికట్టడంతో ఈ నిర్మాణాన్ని పూర్తి చేసినట్టు ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి చెప్పారు.

16న కల్యాణోత్సవం : ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటలకు కాకినాడ రంగరాయ వైద్యకళాశాల గ్రౌండ్స్‌లో శ్రీ శ్రీనివాస దివ్యకళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వేడుకగా నిర్వహించనున్నట్టు చెప్పారు. సుమారు 30వేల మందికి పైగా భక్తులు కల్యాణాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చెప్పారు. సమావేశంలో త్రిపురసుందరి ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ జొన్నాడ చినబాబు ఉన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ యస్.శ్రీధర్, ఆదేశాల మేరకు రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నాటు సారాను నిర్మూలించేందుకుగాను కొత్తపేట సబ్-డివిజన్, డిఎస్పి, కెవి రమణ పర్యవేక్షణలో రావులపాలెం సర్కిల్ ఇన్స్పెక్టర్ రామ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ పరిధిలో, పులిదిండి గ్రామం గోదావరి నది పరీవాహక ప్రాంతం, ఇసుక ర్యాంపు వద్ద నాటు సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ఆత్రేయపురం పోలీస్ స్టేషన్, సబ్-ఇన్స్పెక్టర్ యస్ శ్రీనివాసు వారి సిబ్బందితో ఈ దాడులు చేపట్టారు. సారా బట్టీలను ధ్వంసం చేసి అక్కడ నాటు సారా తయారు చేయుటకు నిల్వ చేసిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

అగ్నిప్రమాదంలో ఇళ్ళు దగ్ధం

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరం మండలం పోతవరం గ్రామంలో సోమవారం తెల్లవారు జామున జరిగిన అగ్నిప్రమాదంలో పెద్దిమేని మంగాయమ్మ, పెద్దిమేని శ్రీనివాసరావులకు చెందిన ఇళ్లు కాలి బూడిదయ్యాయి. ఈప్రమాదం షార్ట్ సర్క్యూట్ వలన జరిగిందని తెల్లవారు జామున జరగడంతో ఇల్లు, ఇంట్లోని దుస్తులు, వంట సామాగ్రి మొత్తం కాలిపోయాయని కట్టుబట్టలతో మిగిలామని బాధితులు వాపోయారు. ఈ ప్రమాదంలో ఒక లక్ష రూపాయల నగదు, రెండు కాసుల బంగారం, రెండు బీరువాలు, లక్ష రూపాయల విలువైన ప్లంబింగ్ మెషిన్ అగ్నికి ఆహుతి అయ్యాయి. విషయం తెలిసిన వెంటనే సోమవారం జనసేన పార్టీ పి గన్నవరం ఇంచార్జ్ గిడ్డి సత్యనారాయణ అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించి బాధితులను కలుసుకుని ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. తనవంతు సహాయంగా ఒక్కొక్కరికి పదివేలురూపాయలు, ఇరువై ఐదు కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో పి గన్నవరం ఎంపిపి నాగలక్ష్మి, జనసేన మండల ప్రెసిడెంట్ ఎస్ సత్యనారాయణ, టి. వెంకటేష్, డి. రాంబాబు, టి. శ్రీనివాస్, బి. తాతాజీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర - గోకవరం: గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్ కెళ్ళ జ్యోతి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ను సోమవారం జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బళ్ళా శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఎంపీలు గ్రామాల్లో ప్రజలతో మమేకమై పరిధి మించకుండా ప్రధమ చికిత్స లు మాత్రమే అందించాలని అన్నారు. జిల్లా కోశాధికారి పీ చిన్ని,శెరకణం మురళీ, మండల అధ్యక్షులు ఎమ్ నాగేశ్వరరావు, గంటి వెంకటేష్,కిరణ్, బి. బూరిబాబు,వేగి ప్రసాద్ గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

500 రోజుకు చేరుకున్న అన్నా కాంటీన్

విశాలాంధ్ర - అమలాపురం : దివంగత లోక్ సభాపతి జీఎంసి బాలయోగి తనయుడు అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి జీఎం హరీష్ బాలయోగి ఆధ్వర్యంలో 500 రోజులుగా స్థానిక ముమ్మిడివరం గేట్ సెంటర్‌లో అన్నార్తులను ఆదుకుంటున్నారు. ఉచితంగా ఆయన అందిస్తున్నారు. 500 రోజు సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో హరీష్ బాలయోగితో పాటు, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మెట్ల రమణబాబు, అల్లాడ స్వామి నాయుడు, చిక్కాల గణేష్, పెచ్చేట్టి విజయ లక్ష్మీ, వాసంశెట్టి సత్యం, గంధం పల్లంరాజు, బత్తుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.